సిరుల తల్లీ.. కల్పవల్లి



కరపలో దుర్గాదేవి అమ్మవారు

- నేడు వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన మార్కెట్



కాకినాడ పెద్ద మార్కెట్‌లో పత్రి, పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కాకినాడ సిటీ: మహాలక్ష్మీ.. మా ఇంట కొలువై ఉండు.. అష్టైశ్వర్యాలు ప్రసాదించి కాపాడు అంటూ ఆ సిరుల తల్లిని కొలిచే వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధమైంది. మూడో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వ్రత పూజలకు గురువారం నుంచే మహిళలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సిరుల తల్లి కట్టుబొట్టు నుంచి నైవేద్యం వరకూ ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటారు. అమ్మవారితో పాటు దీపాలు, కలశాలు, ముత్తయిదువులకు ఇచ్చే తాంబూలాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని కొనేందుకు మహిళలు చొరవ చూపడంతో నగరంలోని మార్కెట్ కళకళలాడింది. సౌభాగ్యం, సంపదలు, కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు ఆచరించే వరలక్ష్మీ వ్రతం ప్రధానమైంది. ఇళ్లలో పవిత్ర కలశాన్ని ప్రతిష్ఠించి అమ్మవారి మూర్తిని ఉంచి పూజలు చేస్తారు. దీంతో గత వారం రోజులుగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల దుకాణాలు రద్దీగా మారాయి. ముఖ్యంగా అమ్మవారి బంగారు రూపులను బరువును బట్టి రూ. 9 వేల నుంచి రూ. 18 వేల వరకూ విక్రయిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో నిలిచిన ట్రాఫిక్

బోట్‌క్లబ్: శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను పురస్కరించుకుని గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలు సందడిగా కనిపించాయి. భానుగుడి సెంటర్, గాంధీనగర్, జగన్నాథపురం వంతెన, పెదమార్కెట్, చినమార్కెట్, మెయిన్ రోడ్డు వంటి ప్రాంతాల్లో పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. వ్రతంలో అత్యంత ప్రధానమైన అరటి పండ్లు డజను రూ.50–60 మధ్య అమ్మకాలు జరగ్గా, ఒక్కో చామంతి పువ్వు రూ.5 పలికింది. పూజా సామగ్రి కొనుగోలుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో తాత్కాలిక పూజా విక్రయ దుకాణాల వద్ద ట్రాఫిక్ పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, భానుగుడి, రామారావుపేట, గాంధీనగర్, అశోక్‌నగర్, నాగమల్లితోట జంక్షన్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపై పెట్టి పూజా సామగ్రి కొనుగోలు చేయడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.

రూరల్‌లోనూ రద్దీగా..

కాకినాడ రూరల్/ కరప: సౌభాగ్యం, లక్ష్మీదేవి అనుగ్రహం కోరుతూ మహిళలు ఆచరించే వ్రతాల్లో వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేక స్థానం ఉంది. మూడో శుక్రవారం పూజల కోసం గురువారం వివిధ కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. సర్పవరం మార్కెట్‌లో పండ్లు, పూలు, పత్రి, వస్త్ర, బంగారు దుకాణాలు రద్దీగా కనిపించాయి. కరపలో వస్త్ర, బంగారు దుకాణాలు, పండ్ల షాపుల వద్ద సందడి నెలకొంది. కరప, వేళంగి, నడకుదురు, పెనుగుదురు, గొర్రిపూడి, అరట్లకట్ట తదితర గ్రామాల్లో మార్కెట్లలో జోరుగా వ్యాపారం జరిగింది. కొబ్బరి, బత్తాయి, యాపిల్, దానిమ్మ, అరటి పండ్లు వంటి ధరలు భారీగా పెరిగాయి. పూల రేట్లయితే కొండెక్కాయి. ఒక గ్రాము లక్ష్మీదేవి రూపు రూ.10,200కు కొనుగోలు చేసినట్టు వినియోగదారులు తెలిపారు. బంగారు షాపుల్లో ఒక రూపు కొంటే చీర ఉచితమని ఆఫర్లు ఇవ్వడంతో కొనేందుకు ఎగబడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలను ముస్తాబు చేశారు.

ప్రజా విద్యాలయం నిర్వహణ భేష్



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందించిన ఆర్డీఓ మల్లిబాబు

బోట్‌క్లబ్: స్థానిక మధురానగర్‌లోని ప్రజా విద్యాలయం పాఠశాల నిర్వహణ బాగుందని కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. యోగద సత్సంగ ధ్యాన మండలి బహూకరించిన 150 స్కూల్ బ్యాగ్‌లను గురువారం ఆయన విద్యార్థులకు అందించారు. 25 ఏళ్లుగా ఈ సంస్థ చేస్తున్న సేవ మరువలేనిదన్నారు. ఈ పాఠశాలను నిర్వహిస్తున్న కరస్పాండెంట్, కార్యదర్శి శ్రీవక్కలంక రామకృష్ణ సేవలు నిరుపమానమన్నారు. తమవంతు బాధ్యతగా సేవ చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. దేశభక్తి గీతాలను ఆలపించిన పిల్లలతో తాను కూడా గొంతు కలిపి గానంలోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. తన వంతు సహాయంగా ఆర్డీఓ రూ. 10 వేలను అందించారు. కాకినాడ యోగద సత్సంగ ధ్యాన మండలి కార్యదర్శి వాసు దేవరావు, సువర్చల, ఇతర సీనియర్ ధ్యాన మండలి భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు లక్ష్మీనారాయణ, గోవిందమ్మ, అప్పారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి దేశభక్తి, అభ్యుదయ గీతాలపై శిక్షణ

కాకినాడ సిటీ: స్థానిక **యూటీఎఫ్ టీచర్స్** హోంలో ఈ నెల 9, 10 **తేదీల్లో దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణకు ఏర్పాట్లు చేసినట్లు** యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ సూరిబాబు, కేవీవీ నగేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎంఎంఆర్ ప్రసాద్, జీఎస్ వర్మ గురువారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో సాంస్కృతిక గీతాలు ఆలపించడానికి తగిన విధంగా దేశభక్తి, అభ్యుదయ పాటల శిక్షణ ఇస్తున్నామన్నారు. నగర పరిసరాల్లో వివిధ పాఠశాల్లో విద్యార్థినీ విద్యార్థులు 9, 10 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు సీహెచ్ వెంకటరమణ 90100 44277 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం

కాకినాడ రూరల్: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, నూరు శాతం పోషక విలువలు కలిగి ఉంటాయని ప్రసూతి వైద్యురాలు ప్రియాంక అన్నారు. లయన్స్ క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలోని లయన్స్ క్లబ్ మల్టిపుల్ సర్వీసెస్ సెంటర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పతాయని, వ్యాధి నిరోధిక శక్తిని పెంచుతాయన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

సేవలు అభినందనీయం



క్రీడా సామగ్రి అందిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడ సాంబమూర్తినగర్‌లో విభిన్న ప్రతిభావంతుల హాస్టల్‌లో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా సామగ్రిని అందించారు. విభిన్న ప్రతిభావంతులకు సదుపాయాలు కల్పించడానికి ఫౌండేషన్ అందిస్తున్న చేయూత మరువలేనిదన్నారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కావాల్సిన ఏ సదుపాయాలు కల్పించడానికైనా తమ ఫౌండేషన్ ముందుంటుందన్నారు.

రైతు రుణాలపై చర్చ



పండూరు సొసైటీలో రైతులతో సమావేశమైన చైర్మన్ రామ్‌కుమార్

కాకినాడ రూరల్: పండూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా నియమితులైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ గురువారం రైతులతో సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అందించే రుణాలు, తదితర వాటిపై చర్చించారు. సొసైటీ అధికారులు సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. రైతులకు రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు.

ట్రస్టు బోర్డు కోసం దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయడానికి భక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఒక చేతిలో అక్షయ పాత్ర, మరో చేతిని అభయహస్తంగా చూపుతూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు, చండీ పారాయణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు ఛామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు అమ్మవారికి చీర, సారె సమర్పించారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



కొరుపల్లిలో మన మిత్ర యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అనుపమ

కరప: కొరుపల్లి గ్రామంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, కరపలో డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావులు గురువారం పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. పనులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వస్తున్నారా అంటూ తెలుసుకున్నారు. పంచాయతీ కార్మికులు వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌లో మన మిత్ర యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే గ్రామ సచివాలయానికి వెళ్లకుండానే ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు. మన మిత్ర యాప్, పంచాయతీ పనితీరుపై వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి వివరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు.

రూ.22.90 కోట్ల చెక్కు అందజేత



కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు చెక్కు అందజేస్తున్న రెప్కో బ్యాంక్ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రెప్కో బ్యాంక్ నికర లాభంలో రూ.22.90 కోట్ల చెక్కును కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బ్యాంక్ చైర్మన్ సంతానం, డైరెక్టర్ తంగరాజు, ఎండీ ఓఎం గోకల్ అందజేశారు. ఈ విషయాన్ని గురువారం కాకినాడ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ డి.దస్తగిరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ చరిత్రలో 2024–25కు గాను అత్యధికంగా రూ.140 కోట్ల నికరలాభం వచ్చిందన్నారు. రెప్కో బ్యాంక్ ద్వారా ఇంటి తనఖాపై రుణాలు, సీనియర్ సిటిజన్స్‌కు అత్యధికంగా 8.25, ఇతరులకు 7.75 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. బంగారం గ్రాముపై రూ.7,200 ఇస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 0884–2377977 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఉద్యోగ మేళాలను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం వికాస ఆధ్వర్యంలో కాకినాడ ఐడియల్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు వారం రోజులుగా అధికారులు అహర్నిశలు శ్రమించారని కలెక్టర్ అన్నారు. హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగం వస్తే వెళ్లడానికి సిద్ధంగా లేనివారు, కేవలం ఇంటర్వ్యూ అనుభవం కోసం వచ్చే వారి వల్ల ఇతరుల అవకాశాలకు ఇబ్బంది ఎదురవుతుందన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు మాట్లాడుతూ ఈ మేళాకు 35 కంపెనీల ప్రతినిధులు వచ్చారన్నారు. 1,200 ఉద్యోగాలకు 1,150 మంది నిరుద్యోగ యువతీ, యువకులు వచ్చారన్నారు. వివిధ కంపెనీలకు ఎంపికైన 648 మంది అభ్యర్థులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసినట్లు లచ్చారావు తెలిపారు. ఐడియల్ కళాశాల ప్రిన్సిపల్ టి.సత్యనారాయణ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, డైరెక్టర్ ఎం.రంజిత్, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ నిమజ్జనోత్సవాలపై సమాలోచన



గణపతి నిమజ్జనోత్సవాలపై చర్చిస్తున్న నగర, రూరల్ గణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట సాగర తీరాన గణపతి నిమజ్జనోత్సవాలపై శుభం కాపు కల్యాణ మండపంలో నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. సమితి రూరల్ కోఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నెల 27న వినాయక సమితి ఉత్సవాలు జరుగుతాయన్నారు. గణపతి నిమజ్జనోత్సవాలు సెప్టెంబరు 6, 7 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. సమావేశంలో నగర గణేశ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, సమితి జిల్లా అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రువ్వూరి సుబ్రహ్మణ్యం, పైడా భావనప్రసాద్, చిట్నీడి శ్రీనివాస్, చలపతి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డికి డాక్టరేట్



బాలాజీచెరువు: నిపుణుల బృంద సిఫార్సు మేరకు కె.వెంకటేశ్వరరెడ్డికి జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రకటించింది. ఎఫీషియంట్ వీఎల్ఎస్ఐ ఇంప్లిమెంటేషన్ ఫర్ న్యూరోమార్ఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై సిద్ధాంత వ్యాసం జేఎన్‌టీయూ కళాశాల ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బాలాజీ పర్యవేక్షణలో సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డిని పలువురు అభినందించారు.

లీకులతోనే కుళాయిల నుంచి నాచు నీరు

- గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు



లీకవుతున్న ప్రధాన పైపులైన్‌ను పరిశీలిస్తున్న డీఈ, ఏఈలు

సామర్లకోట: పాత సామర్లకోట ప్రాంతాలకు వారం రోజులుగా నాచు రంగులో నీరు రావడంతో అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన పైపులైన్‌పై దృష్టి సారించారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం సమీపంలోని బడేలమ్మ చెరువు వద్ద ప్రధాన పైపులైన్‌కు లీకు ఏర్పడినట్లు ఇంజినీరింగ్ అధికారులు గురువారం గుర్తించారు. బడేలమ్మ చెరువులో చేపల వేట సాగించడానికి చెరువులో నీటిని బయటకు ఒకేసారి వదలి వేయడంతో తాగు నీటి ప్రధాన పైపులైన్ పాడైందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. చెరువులో నాచుతో నిండిపోయిన నీరు ప్రధాన పైపులైన్ ద్వారా కుళాయిల నుంచి వచ్చిందన్నారు. చేపల వేట సాగించే మత్స్యకార సంఘానికి చెందిన చెరువు వద్ద మోటారు పాడై పోవడంతో నీటిని అవుట్‌లెట్ ద్వారా విడిచి పెట్టడంతో విమల్ బాట్లింగ్ వద్ద ఉన్న కల్వర్టు దిగువ భాగంలో పైపులైన్ ధ్వంసం అయినట్లు గుర్తించారు. ఫిల్టర్ బెడ్ నుంచి స్వచ్ఛమైన తాగు నీరు విడుదల చేస్తున్నా మున్సిపల్ కుళాయిల నుంచి నాచు రంగులో నీరు రావడంతో మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ శాఖకు చెందిన అధికారులు తలలు పట్టుకున్నారు. పైపులైన్ లీకు పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జేసీబీ సాయంతో తుప్పలను తొలగించి లీకుల నివారణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ కె.శశిధర్, ఏఈ నరసింహారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం పట్టు వస్త్రాలకు గుర్తింపు



చేనేత కార్మికులకు ముద్ర రుణాలను అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెద్దాపురం: స్థానిక చేనేత పట్టు వస్త్రాలకు మంచి గుర్తింపు ఉందని, ఆ ఖ్యాతిని దేశ వ్యాప్తంగా చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. గురువారం స్థానిక ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం విద్యుత్ రాయితీ కల్పిస్తుందన్నారు. అనంతరం 50 మంది చేనేత కార్మికులకు ముద్ర రుణాల కింద రూ. కోటి చెక్కును కలెక్టర్ అందజేశారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జయశంకర్ పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు



సర్వర్లు మొరాయించడంతో వేచి ఉన్న ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో సర్వర్లు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రిజర్వేషన్ల టిక్కెట్ల కోసం వేసి ఉన్న ప్రయాణికులకు సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రైల్వే బుకింగ్ కౌంటర్లతో పాటు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన మెషీన్లు కూడా పనిచేయలేదు. అయితే బుకింగ్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు బారులు తీరారు. దీనిపై స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌ను వివరణ కోరగా కేవలం 10 నిమిషాలు జోనల్ వైడ్ సర్వర్లు నిలిచిపోవడంతో కొద్దిగా సమస్య ఏర్పడిందన్నారు. ప్రయాణికులకు సంబంధించిన ఎటువంటి రైలు మిస్ కాలేదన్నారు. వెంటనే టెక్నికల్ అధికారులు సమస్యను పరిష్కరించారన్నారు. సర్వర్లు పనిచేసిన వెంటనే అదనపు కౌంటర్లతో ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చామని తెలిపారు.

రేషన్ బియ్యం చోరీపై కేసు

కాకినాడ క్రైం: స్థానిక జగన్నాథపురం భవన్నారాయణ సెంటర్ సమీపంలో మసీదు వద్ద ఉన్న రేషన్ దుకాణంలో 250 కిలోల బియ్యం చోరీకి గురయ్యాయని డీలర్ పి.నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం రాత్రి తాళాలు వేసి వెళ్లానని, గురువారం ఉదయం వచ్చే సరికి తాళాలు బద్దలు కొట్టి ఉండడాన్ని గమనించానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశభక్తిపై విద్యార్థులకు పోటీలు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

సామర్లకోట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తిపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి పెంచేందుకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని అన్నారు. ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, ఎస్.హరినాథ్, పి.బ్రహ్మానందం, పి.నిర్మల, పీఈటీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రావయ్యా... గణపయ్యా

- వినాయక చవితికి విగ్రహాల ముస్తాబు
- తయారీలో కళాకారుల నిమగ్నం
- ఉత్సవ ఏర్పాట్లలో కమిటీలు



రంగులద్ది సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

కాకినాడ సిటీ: జై జై గణనాథా.. జయమనివ్వు గజాననా.. అంటూ కొలిచే వినాయక చవితి మరికొద్ది రోజుల్లో రానుంది. ఈ ఉత్సవాలకు ఇప్పటి నుంచే ఉత్సవ కమిటీల హడావుడి మొదలైంది. కాకినాడ పట్టణం, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 30 ఏళ్లగా రాజస్థానీయులు ఒక అడుగు మట్టి విగ్రహాలు మొదలుకుని 13 అడుగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తయారు చేసి వాటికి రంగులు అద్దుతున్నారు. ఈ పనిలో వారంతా నిమగ్నమయ్యారు. గతంలో ఏదో ఒక కాలనీలో వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తే అక్కడే పండగ సందడి కనిపించేది. కానీ నేడు దాదాపు అన్ని కాలనీలు, వీధిల్లో వినాయక విగ్రహాలు కొలువుదీరుతున్నాయి. మండపాల్లో విగ్రహాలు, అవసరమైన సరంజామను సమకూర్చుకోవడంలో ఇప్పటికే ఉత్సవ కమిటీలు నిమగ్నమయ్యాయి. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు.

మట్టి విగ్రహాలే మేలు

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో మేలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని శాస్త్రంతో పాటు పర్యావరణ ప్రేమికులు చెబుతున్నా ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ప్రతిమల సంఖ్య పెరుగుతోంది. ఇందుకు ఈ విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండటంతో వాటిపైనే ఎక్కువ మంది మొగ్గ చూపుతున్నారు. దీనిని కట్టడి చేయాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే కాకినాడ నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 70కి పైగా కుటుంబాలు 30 ఏళ్లుగా విగ్రహాల తయారీని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నాయి. వినాయక చవితి వస్తుందంటే మూడు నెలల ముందు నుంచే సిద్ధం అవుతారు. సుమారు మూడు నెలల పాటు ఈ కుటుంబాలు గణపతి ప్రతిమల తయారు చేయడం ప్రారంభిస్తారు.

లాభాలు.. అనర్థాలు

సహజ సిద్ధంగా దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేయడం మంచిది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది. మట్టి విగ్రహాల నిమజ్జనంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. సహజ సిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు కాలువలు, గోదావరి, ఉప్పుటేర్లు, సముద్రాల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి. ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ జలాలు తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిసిన నీటి కారణంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిపిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులను తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.

ముందస్తు ఆర్డర్ల మేరకు..



ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి ముందస్తు ఆర్డర్లు వస్తున్నాయి. తయారీకి అవసరమైన బంకమట్టి, కొబ్బరిపీచు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులు తదితర ముడి పదార్థాల ధరలు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో ప్రతిమల ధరలు కూడా అదే రీతిన పెరిగాయి. అడ్వాన్స్‌లు తీసుకున్నాం కాబట్టి ఒప్పందం ధరకే ప్రతిమలు అందిస్తాం.

– శ్రీరామ్, విగ్రహాల తయారీదారుడు, తూరంగి

నిలిచిపోయిన లారీ

- ట్రాఫిక్‌కు అంతరాయం



క్రేన్‌తో సిమెంట్ లోడ్ లారీని పక్కకు లాగుతున్న దృశ్యం

సామర్లకోట: మండలంలోని మాధవపట్నం రైల్వే గేటు రోడ్డులో గురువారం సాయంత్రం సిమెంట్ లోడు లారీ సాంకేతిక లోపంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. మాధవపట్నం నుంచి సర్పవరం వెళ్లే రోడ్డు సింగిల్ వే కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడు క్రేన్లను రప్పించి మాధవపట్నం గేటు వద్ద నిలిచిపోయిన లారీని సర్పవరం రోడ్డులోని ఖాళీ ప్రదేశం వరకూ తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారమైంది.